క్లుప్తంగా

ఎర్నిమాంబకు ప్రత్యేక పూజలు



ఎర్నిమాంబకు హారతి ఇస్తున్న అర్చకుడు శ్రీకాంత్‌శర్మ

కంచరపాలెం: కాన్వెంట్ కూడలిలో వెలసిన ఎర్నిమాంబ అమ్మవారి ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. ఈవో డీవీఎస్ సురేష్‌బాబా నేతృత్వంలో ఆలయ అర్చకులు పులఖండం శ్రీకాంత్ శర్మ ఉదయం నుంచి అమ్మవారికి కుంకుమ పూజలు, విశేషార్చనలు, అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ పూజారి వాసుపల్లి విజయమ్మ అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేశారు. భక్తులకు ప్రత్యేక ఉచిత దర్శనాలతో పాటు రూ.10, రూ.50 ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశారు. భక్తుల మౌలిక వసతులపై ఈవో సురేష్‌బాబా ప్రత్యే చర్యలు చేపట్టారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ సిబ్బంది రామకృష్ణ, ప్రసాద్, ట్రస్టు సభ్యులు, స్వచ్ఛంద సంస్థల సభ్యులు భక్తుల సౌకర్యాలను పర్యవేక్షించారు.

రక్తదానంతో ప్రాణదానం



రక్తదానం చేస్తున్న సత్యసాయి సేవా సమితి సభ్యులు

గోపాలపట్నం: గోపాలపట్నం సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ప్రభుత్వ విప్ గణబాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్త దానం చేయడం ప్రాణదానం చేసినంత గొప్ప కార్యమని కొనియాడారు. రక్తదానం చేసిన వారిని అభినందించారు. కార్యక్రమంలో సత్యసాయిబాబా సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

అనాథ బాలికలకు అన్నదానం



అనాథ బాలికలకు అన్నదానం చేస్తున్న శ్రీలత

కంచరపాలెం: కంచరపాలెం పరిధి దుర్గానగర్‌లోని హనీ హన్నా బాలికల సంరక్షణ కేంద్రంలో అనాథ బాలికలకు ఆదివారం సీనియర్ జర్నలిస్ట్ శ్రీలత అన్నదానం చేశారు. సంపాదనలో కొంత భాగాన్ని ఎప్పుడూ సేవా కార్యక్రమాలకు కేటాయించడంలో సంతృప్తి ఉంటుందన్నారు. కార్యక్రమంలో సంరక్షణ కేంద్రం సభ్యులు, బాలికలు పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మికి శ్రావణలక్ష్మి పూజలు



శ్రావణలక్ష్మి పూజలో పాల్గొన్న భక్తులు

దాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో నిర్వహిస్తున్న శ్రీలక్ష్మి పూజలు ఆదివారం 17వ రోజుకు చేరాయి. ఆదివారం ఈ పూజలో 12 మంది ఉభయదాతలు పాల్గొన్నారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.400 చెల్లించాలని ఆలయ ఈవో కె.శోభారాణి తెలిపారు. మరిన్ని వివరాలకు 0891-2711725, 2566514 నంబర్లలో సంప్రదించవచ్చు. కార్యక్రమంలో ఏఈవో కె.రాజేంద్రకుమార్, సహాయ ఇంజినీర్ డీవీఎస్ రామరాజు, పర్యవేక్షకుడు తిరుపతిరావు, వేదపండితులు, ఆలయ సిబ్బంది, పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

సమస్యల నిలయం c/o కంచరపాలెం

- మట్టి రోడ్లను తలపిస్తున్న సీసీ రోడ్లు
- శిథిలమైన వంతెన రక్షణగోడలు
- అధ్వానంగా డ్రైనేజీలు
- విరిగిన విద్యుత్ స్తంభాలతో చీకట్లు..



మట్టిరోడ్డును తలపిస్తున్న గోకుల్ నగర్ నుంచి గౌరీనగర్ వెళ్లే రహదారి

కంచరపాలెం: జీవీఎంసీ 56వ వార్డు పరిధి కంచరపాలెంలోని పలు ప్రాంతాల్లో సమస్యలు తాండవిస్తున్నాయి. కంచరపాలెం నేతాజీ ఫ్లైఓవర్ రక్షణగోడలు శిథిలావస్థకు చేరాయి. రక్షణ గోడల పెచ్చులు విరిగి రోడ్డుపై పడుతున్నాయి. విద్యుత్ స్తంభాలు నేలకు ఒరుగుతున్నా పట్టించుకునే నాధుడు కరువయ్యారు. రాత్రి సమయంలో వంతెనపై అంధకారం రాజ్యమేలుతుంది. కంచరపాలెం ఫ్లైఓవర్ నుంచి నేతాజీ కూడలి, ఊర్వశికూడలి, ఐటీఐ జంక్షన్‌కు వెళ్లే ప్రాంతాల్లో విద్యుత్ లైట్లు సక్రమంగా వెలగకపోవడంతో పాదచారులు, ద్విచక్ర వాహనదారులు అవస్థలు పడుతున్నారు. పాదచారులు ప్రమాదాలకు గురవుతున్నారు.

నాడు సర్వాంగ సుందరంగా..

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో నేతాజీ వంతెనను సర్వాంగా సుందరంగా తీర్చిదిద్దారు. గ్రీనరీతో పాటు రంగులు వేశారు. రోడ్లు, రక్షణ గోడలు నిర్మాణం వంటి పనులు చేపట్టి సుందరీకరణ చేశారు. నేడు కూటమి ప్రభుత్వం అభివృద్ధిపై కన్నెత్తి చూడడం లేదని పలువురు విమర్శిస్తున్నారు. కూతవేటు దూరంలోని జ్ఞానాపురం జోన్-5 జోనల్ కార్యాలయం ఉన్నా... అటుగా జోనల్ కమిషనర్ నుంచి ఇతర ఉన్నతాధికారులు రాకపోకలు సాగిస్తున్నా... సమస్యలు కానరావడం లేదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



కంచరపాలెంలో సక్రమంగా విద్యుత్ లైట్లు వెలగక చీకటిలో ప్రయాణం



విరిగిపోయిన స్తంభాన్ని వదిలేశారిలా...

వీధుల్లో అభివృద్ధి అంతంత మాత్రమే

వార్డు పరిధిలో గౌరీనగర్, దుర్గానగర్, గోకుల్‌నగర్, తోటవీధి, చెవుటరాములవీధి, గొల్లకంచరపాలెం, రైల్వేట్రాక్ రహదారుల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీలు శిథిలావస్థకు చేరాయి. రైల్వేట్రాక్ రహదారి నుంచి ఊర్వశి జంక్షన్‌కు వెళ్లే రహదారులు మట్టి రోడ్లను తలపిస్తున్నాయి. స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు వార్డు పర్యటనలు చేసేటప్పుడు స్థానిక ప్రజలు ఫిర్యాదులు చేస్తే నమోదు చేసుకోవడమే తప్పా... ఎలాంటి ప్రయోజనం లేదని పలువురు స్థానికులు విమర్శిస్తున్నారు. కూటమి నాయకులు నివాసం ఉన్నచోట అభివృద్ధి చేసి మిగతా ప్రాంతాలను వదిలేయడంతో అవస్థలు పడుతున్నామని ప్రజలు వాపోతున్నారు.

అధికారులు స్పందించాలి

వార్డులో అనేక సమస్యలు ఉన్నాయి. స్థానిక ప్రజాప్రతినిధులకు ఫిర్యాదు చేస్తున్నా పట్టించుకోవడంలేదు. జోనల్ కార్యాలయంలో సమస్యలపై వినతులు అందించినా ప్రయోజనం కనిపించడంలేదు. జీవీఎంసీ నిధులు మంజూరు చేసినా అభివృద్ధి పనులు ప్రారంభించడం లేదు. రోడ్లు, కాలువలు సక్రమంగా లేక ఇబ్బందులు పడుతున్నాం. ఉన్నతాధికారులు వార్డులో పర్యటించి ప్రజా సమస్యలు పరిష్కరించాలి.

– ఎస్.గౌరి, దుర్గానగర్, కంచరపాలెం.

పారిశుధ్య పర్యవేక్షణ గాలికి..

వార్డుకు పూర్తిస్థాయిలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ లేకపోవడంతో పారిశుధ్య పనులు అంతంత మాత్రంగానే జరుగుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. డ్రైనేజీలు శిథిలం కావడం, సీసీ రోడ్లు మట్టి రోడ్లను తలపించడంతో ఊడ్చేందుకు ఇబ్బందిగా ఉండడంతో పనులు సక్రమంగా చేయలేకపోవతున్నామని పారిశుధ్య వాపోతున్నారు. శానిటరీ సూపర్‌వైజర్ ఇటీవల రిటైర్ అయ్యారు. పక్క వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ అదనపు బాధ్యతలు చేపట్టడం, సచివాలయ శానిటరీ కార్యదర్శులు బదిలీ కావడంతో కొత్త వారికి అవగాహన లేక పూర్తి స్థాయిలో పారిశుధ్య పనులు జరగడం లేదని ప్రజలు వాపోతున్నారు.



దుర్గానగర్ రైల్వేట్రాక్ రహదారిలో శిథిలమైన డ్రైనేజీలు, రోడ్డు

మరియమ్మ విగ్రహంతో ర్యాలీ

సింధియా: జీవీఎంసీ 63వ వార్డు క్రాంతినగర్ ఆర్సీఎం చర్చి వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకుని వార్డులోని పలు ప్రాంతాల్లో క్రీస్తు జనులు ప్రార్థనలతో కూడిన భారీ ర్యాలీ నిర్వహించారు. ఏసు క్రీస్తు గొప్పదనాన్ని చాటుతూ క్రీస్తు మాతృమూర్తి మరియమ్మ విగ్రహంతో ర్యాలీ చేపట్టి అనంతరం చర్చి ఆవరణలో విగ్రహ ప్రతిష్ట చేశారు. ఏసుక్రీస్తు జనుల పాపాలను క్షమించేందుకు ఈ భూమి మీదకి వచ్చారని, ఆయన గొప్పదనాన్ని తెలుసుకుని శాంతి, సమానత్వంతో జనులంతా బతకాలని కోరుతూ ర్యాలీ నిర్వహించినట్లు ఆర్సీఎం చర్చి ఫాదర్ ప్రదీప్‌కుమార్ తెలిపారు.



63వ వార్డులో మరియమ్మ విగ్రహంతో ర్యాలీ చేస్తున్న క్రీస్తు జనులు

జూలో సింహాలపై అవగాహన

ఆరిలోవ : ఇందిరాగాంధీ జూ పార్కులో ప్రపంచ సింహాల దినోత్సవాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా జూ బయోస్కోప్‌లో నిర్వహించిన సమావేశంలో సందర్శకులు, వెటర్నరీ విద్యార్థులకు సింహాలపై అవగాహన కల్పించారు. క్యూరేటర్ జి.మంగమ్మ మాట్లాడుతూ పర్యావరణంలో సింహాల ప్రాధాన్యం, జూ పార్కుల్లో వాటి సంరక్షణ చర్యలను వివరించారు. జూ పార్కులో ఒక జత సింహాలున్నాయన్నారు. వాటి సంరక్షణకు నిరంతరం జూ వెటర్నరీ సిబ్బంది, యానిమల్ కీపర్లు జాగ్రతలు తీసుకుంటున్నారన్నారు. వాటికి అందిస్తున్న వైద్య సేవలు, ఆహారం, జాగ్రత్త చర్యలను వివరించారు. ఇటీవల జూలో ఒక సింహాన్ని వివేక్ గోయంకా అనే వ్యక్తి దత్తత తీసుకున్నారన్నారు. మిగిలిన వన్యప్రాణులను కూడా దత్తత తీసుకోవడానికి దాతలు ముందుకు రావాలని ఆమె కోరారు. దత్తత తీసుకున్న వారికి ఆదాయ పన్నులో 50 శాతం వరకు మినహాయింపు ఉంటుందన్నారు. కార్యక్రమంలో జూ అసిస్టెంట్ క్యూరేటర్లు బి.గోపి, పి.వి.చౌదరి, వెటర్నరీ వైద్యుడు పి.భానుబాబు, సెక్షన్ ఆఫీసర్లు పాల్గొన్నారు.



వెటర్నరీ విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న క్యూరేటర్ మంగమ్మ

స్మార్ట్ మీటర్లను వ్యతిరేకిస్తూ ర్యాలీ

గాజువాక: అదానీ స్మార్ట్ మీటర్లను వ్యతిరేకిస్తూ సిరి ఎన్‌క్లేవ్, గ్రీన్ లైఫ్ అపార్ట్‌మెంట్, స్వర్ణసాయి రెసిడెన్సీ అపార్ట్‌మెంట్ వాసులు ఆదివారం ర్యాలీ నిర్వహించారు. తోకాడ సమైక్య అపార్ట్‌మెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో తోకాడలోని సమైక్య అపార్ట్‌మెంట్ వద్ద ప్రారంభమైన ఈ ర్యాలీ ఆటోనగర్‌లోని ఏడీఈ కార్యాలయం వరకు కొనసాగింది. ఈ సందర్భంగా అసోసియేషన్ నాయకులు రామన్న, ఎం.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ విద్యుత్ చార్జీలను తగ్గిస్తామని అధికారంలోకి వచ్చిన టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఏడాదిలోపే సర్దుబాటు రూపంలో చార్జీల భారం మోపిందన్నారు. స్మార్ట్ మీటర్ల రూపంలో మరోసారి భారీ భారాన్ని మోపడానికి పూనుకుందన్నారు. స్మార్ట్ మీటర్లను బిగిస్తే సెల్ ఫోన్ మాదిరిగా విద్యుత్‌కు కూడా రీచార్జి చేసుకోవాలన్నారు. పీక్ అవర్ లోడ్స్ పేరిట భారీగా భారం మోపుతారని అన్నారు. తక్షణమే వీటిని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు బి.తాడన్న, శివకుమార్, నాగేశ్వరరావు, రఘుపతి, శ్రీనివాసరావు, తాతారావు తదితరులు పాల్గొన్నారు.



ఏడీఈ కార్యాలయం వద్ద ప్రసంగిస్తున్న అసోసియేషన్ నాయకుడు వెంకటేశ్వరరావు

బాల వికాస్ ఆధ్వర్యంలో జాతీయపతాకోత్సవాలు

అగనంపూడి: భగవాన్ శ్రీ సత్యసాయి శత జయంతి ఉత్సవాలు, పంద్రాగస్టును పురస్కరించుకొని సత్యసాయి బాల వికాస్ ఆధ్వర్యంలోఆదివారం జాతీయ పతాకోత్సవాలు నిర్వహించారు. 85వ వార్డు కొండయ్యవలసలోని బాల వికాస్ కేంద్రంలో స్వాతంత్య్ర దినోత్సవ వేడుకల్లో భాగంగా బాలలకు జాతీయ నాయకుల వేషధారణ, భజన, క్విజ్, క్రీడా పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. బాల వికాస్ కేంద్రం ప్రాముఖ్యతను సత్యసాయి భజన మండలి ప్రతినిధులు విందుల రామారావు, వరహాలు వివరించారు. విద్యార్థి దశలోనే దేశభక్తి, స్వామి భక్తి, దైవ చింతన, సేవా గుణం అలవర్చడం, అన్ని రంగాల్లో రాణించేలా తీర్చిదిద్దడమే లక్ష్యమని చెప్పారు. కార్యక్రమంలో బలిరెడ్డి సత్యనారాయణ, బాల వికాస్ గురువులు విందుల పద్మలత, రఘునాథరావు, గోవిందరావు, బి.వి.సుబ్బారావు, విదుల పైడినాయుడు పాల్గొన్నారు.



జాతీయ పతాకాలతో బాలలు

సామరస్యంతోనే ప్రపంచ శాంతి

సీతంపేట: హిరోషిమా, నాగసాకి సంస్మరణ దినం సందర్భంగా ప్రపంచ శాంతిని కోరుతూ ఐఏఆర్ఎఫ్ సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక బుల్లయ్య కళాశాలలోని గాంధీ సెంటర్‌లో సదస్సు నిర్వహించారు. సంస్థ చైర్మన్ నరవ ప్రకాశరావు అధ్యక్షతన ముందుగా మహాత్మా గాంధీజీ విగ్రహానికి నివాళులర్పించి, ప్రపంచ శాంతిని కోరుతూ సర్వమత ప్రార్థనలు చేశారు. ప్రపంచ శాంతి కోసం సభ్య దేశాల సహకారంతో నిరంతరం కృషి చేస్తోందని ప్రకాశరావు తెలిపారు. ఆచార్య వి.బాలమోహన్‌దాస్, డాక్టర్ నాగసూరి, వేణుగోపాల్ మాట్లాడుతూ వివిధ వర్గాలు, దేశాల మధ్య సామరస్యం సాధించిన నాడే ప్రపంచ శాంతి సాధ్యమన్నారు.

వాహనాలు జాగ్రత్తగా నడపాలి



డాక్‌యార్డ్ మార్గంలో భూగర్భ విద్యుత్ లైన్ల కోసం తవ్విన రోడ్డు

సింధియా: విశాఖ సిటీ నుంచి గాజువాక వెళ్లే మార్గంలో డాక్‌యార్డ్ సబ్‌స్టేషన్ పరిసర ప్రాంతాల్లో భూగర్భ విద్యుత్ లైన్ల పనులు జరుగుతున్న నేపథ్యంలో ఆ మార్గంలో ప్రయాణించే వాహనదారులు అప్రమత్తంగా నడపాలని హార్బర్ ట్రాఫిక్ సీఐ షణ్ముఖరావు సూచించారు. రోడ్డుకు సగం వరకు గుంతలు తవ్వడంతో రోడ్డు ఇరుకై పోయిందన్నారు. దీన్ని దృష్టిలో పెట్టుకుని వాహనదారులు వేగాన్ని పరిమితం చేస్తూ వాహనాలు నడపాలని కోరారు.

సత్ప్రవర్తనతో మెలగండి



రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న ఫోర్త్ టౌన్ సీఐ ఉమాకాంత్

తాటిచెట్లపాలెం: రౌడీషీటర్లు తమ ప్రవర్తను మార్చుకుని, సత్ప్రవర్తనతో మెలగాలని ఫోర్త్ టౌన్ లా అండ్ ఆర్డర్ పోలీస్ స్టేషన్ సీఐ ఉమాకాంత్ సూచించారు. ఆదివారం స్టేషన్ ఆవరణలో రౌడీషీటర్లుకు ఆయన కౌన్సెలింగ్ నిర్వహించారు. రౌడీషీటర్లు ఎటువంటి గొడవలు, తగాదాల్లో తలదూర్చకుండా మంచిగా నడచుకోవాలన్నారు. హద్దులు మీరితే ఉపేక్షించేది లేదని సీఐ హెచ్చరించారు.

25న కలెక్టరేట్ ఎదుట ధర్నా

సింధియా: పెన్షనర్ల సమస్యలు పరిష్కారం కోరుతూ ఈ నెల 25న కలెక్టరేట్ వద్ద జరిగే ధర్నాను విజయవంతం చేయాలని ఆ సంఘం ప్రధాన కార్యదర్శి ఎస్‌కే హుస్సేన్ పిలుపునిచ్చారు. మల్కాపురం సీఐటీయూ కార్యాలయంలో సీహెచ్ తమ్మారావు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హుస్సేన్ మాట్లాడుతూ పాలకుల మెడలు వంచి సమస్యలు పరిష్కరించుకోవాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు.దీనిలో భాగంగా దశల వారీ ఉద్యమాలు చేపట్టనున్నట్టు తెలిపారు. 25న కలెక్టరేట్ల వద్ద ధర్నాలు, సెప్టెంబర్ 13న విజయవాడ రాష్ట్ర సదస్సు నిర్వహిస్తారని తెలిపారు. డిసెంబర్ 22, 23 తేదీల్లో పార్లమెంట్ సమావేశాలు జరిగే సమయంలో ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద ధర్నా నిర్వహించాలని నిర్ణయించినట్లు తెలిపారు. సమావేశంలో పెన్షనర్ల సంఘం మల్కాపురం జోన్ అధ్యక్షుడు కె.నూకరాజు, ఇతర సభ్యులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న పెన్షనర్లు

అప్పన్నకు విశేషంగా ఆర్జిత సేవలు



స్వామికి యజ్ఞోపవీతధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకుడు



పాల్గొన్న ఉభయదాతలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం ఆర్జిత సేవలు వైభవంగా జరిగాయి. ఉదయం 7 నుంచి స్వర్ణ పుష్పార్చన సేవ ఘనంగా నిర్వహించారు. ఆలయ కల్యాణ మండపం వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్టింపజేశారు. 108 స్వర్ణ సంపెంగ పుష్పాలతో స్వామికి అష్టోత్తర పూజ నిర్వహించారు. ఉభయదాతలకు శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు.

వైభవంగా నిత్యకల్యాణం..

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం ఉదయం 9.30 నుంచి నిత్య కల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ బేడా మండప వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవింద రాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్టింపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవాచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాల ఘట్టాలతో కల్యాణం నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు.

ఉత్సాహంగా స్లో సైక్లింగ్ పోటీలు



సైకిల్ ర్యాలీలో పాల్గొన్న కార్పొరేటర్ గంగారావు, సీఐటీయూ నాయకులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ టౌన్‌షిప్‌లో ఆదివారం స్లో సైక్లింగ్ పోటీలు ఉత్సాహంగా జరిగాయి. స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా టౌన్‌షిప్‌లో నిర్వహించిన 5 కిలోమీటర్ల సైకిల్ ర్యాలీలో సేవ్ వైజాగ్ స్టీల్ అంటూ నినాదాలు చేశారు. ర్యాలీని ప్రారంభించిన 78వ వార్డు కార్పొరేటర్ గంగారావు మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్‌పై బీజేపీ ప్రభుత్వం పార్లమెంట్ సాక్షిగా అభిప్రాయం వెల్లడించినా విశాఖ ఎంపీ శ్రీభరత్ ప్రతిఘటించకపోవడం దుర్మార్గమన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంపై ఒత్తిడి చేసి స్టీల్ ప్లాంట్‌ను రక్షించాలని ఆయన డిమాండ్ చేశారు. స్టీల్ సీటూ ప్రధానకార్యదర్శి యు. రామస్వామి మాట్లాడుతూ కర్మాగారంలో పర్మినెంట్, కాంట్రాక్ట్ కార్మికులను తొలగిస్తూ ప్లాంట్ భవిష్యత్తును అంధకారంలోకి నెడుతున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో పి. శ్రీనివాసరాజు, పుల్లారావు, మొహిద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం

ఉక్కునగరం: ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సీ అధ్యక్షుడు చంద్రరావు అన్నారు. జూనియర్ ఛాంబర్ ఇంటర్నేషనల్ (జేసీఐ) ఆధ్వర్యంలో ఆదివారం సీ భవన్‌లో నిర్వహించిన మెగా మెడికల్ క్యాంప్‌కు మంచి స్పందన లభించింది. లియో ఫార్మా లిమిటెడ్, ఉక్కు అధికారుల సంఘం (సీ) సహకారంతో 'ప్రాజెక్ట్ స్మూత్ వాక్' శిబిరంలో రోగులకు ఎత్తు, బరువు, బీపీ, హెచ్‌బీ, ఆర్‌బీఎస్, నడుం మరియు మోకాలి సారూప్యత, చేయి పటుత్వ పరీక్షలు చేశారు. ఆహారనిపుణులు సలహాలు అందజేశారు. ఉక్కు జనరల్ ఆస్పత్రి విభాగాదిపతి డాక్టర్ సారంగి, ప్లాంట్ పర్సనల్ ఇన్‌చార్జి ఎస్. భాను, సీ అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు కాటం చంద్రరావు, కె.వి.డి. ప్రసాద్‌లు మాట్లాడుతూ రెండో రోజు కూడా కొనసాగనున్న వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జేసీఐ, సీ, లియో ఫార్మా ప్రతినిధులు పాల్గొన్నారు.